నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా తుకారం గేట్ 11 కేవీ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తుకారం గేట్, ఏ సెక్షన్ నుంచి డి సెక్షన్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మురళికృష్ణ తెలిపారు. కంటోన్మెంట్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం, అగ్రా స్వీట్ హౌజ్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇంటి పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, అదేవిధంగా వాసవీనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని ఓల్డ్ వాసవీనగర్, కాకా గూడ, బాలాజీకాలనీ, న్యూ వాసవీనగర్, కార్ఖానా మెయిన్ రోడ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం మూడు నుంచి ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో)టమాటా.11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 38, పందిరి బీర 40, క్యాబేజీ 9, క్యారెట్ 17, దొండ 28, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 35, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 28, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 19, చామగడ్డ 43, మొరంగడ్డ 28, కందగడ్డ 70, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 4–5. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ముగిసిన క్రికెట్ పోటీలు



రసూల్‌పురా: మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ గన్‌బజార్ మైదానంలో ఆదివారం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో 313 గ్రూప్ జట్టు విజేతగా నిలిచింది. పోటీల ముగింపు వేడుకల్లో టీఎన్ శ్రీనివాస్ విన్నర్స్, రన్నర్స్ టీంలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కుమార్ ముదిరాజ్, వాహబ్, అమీర్, సమీర్, తాబేజ్, ఆసీఫ్, ముజాహిద్, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేత అర్బత్ తల్లి మృతికి ఏఐసీసీ సభ్యురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ నివాళులు అర్పించారు. బీకేగూడలోని అర్బత్ నివాసానికి వెళ్లి ఆయన తల్లి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఓయూలో ముగిసిన కేసీఆర్ కప్ టోర్నమెంట్

ఉస్మానియా యూనివర్సిటీ: మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా ఓయూలో నిర్వహించిన కేసీఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. విజేతగా ఓయూ థండర్స్ జట్టు నిలిచింది. ఓయూ ఆర్ట్స్ కాలేజీ వద్ద సోమవారం జరిగే కేసీఆర్ జన్మదిన వేడుకలు జరుగనున్నాయి. వేడుకలకు మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ మాజీ కమీషన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నాగరాం ప్రశాంత్ ఆదివారం తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక



సనత్‌నగర్: జెక్‌కాలనీ వాసవీ డ్రీమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి కేఆర్‌కే రెడ్డి సమక్షంలో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఆయన ప్రకటించారు. అధ్యక్షుడిగా డి.జయబాబు, ఉపాధ్యక్షుడిగా ఎం.సురేష్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాంమోహన్, కోశాధికారిగా టీఎస్‌పీ ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా జీపీ మణికంఠలు ఎన్నికైనట్లు కేఆర్‌కే రెడ్డి తెలిపారు.

క్రీడలపై దృష్టి సారించాలి

ముషీరాబాద్: క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ప్రతి ఒక్కరూ క్రీడలపై దృష్టి సారించాలని తైక్వాండో తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్(టీటీఏ) కోశాధికారి సీహెచ్ మారుతీ వరప్రసాద్ అన్నారు. తైక్వాండో చాంపియన్‌షిప్–2025 పోటీల్లో 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

మోడల్ మార్కెట్లకు మోక్షమెప్పుడో..?

ఉప్పల్ సర్కిల్ పరిధిలో
రూ.2 కోట్లతో 3 చోట్ల నిర్మాణం

- వసతుల్లేక వచ్చేందుకు జంకుతున్న లబ్ధిదారులు
- ఏళ్లుగా నిరుపయోగంగానే ఉంటున్న వైనం



గాంధీనగర్‌లోని మోడల్ మార్కెట్

ఉప్పల్: వారంతపు సంతల్లో కూరగాయలు విక్రయించే వారికోసం గత ప్రభుత్వం నిర్మించిన మోడల్ మార్కెట్లకు మోక్షం కలగడ లేదు. అందులో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఏళ్లుగా నిరుపయోగంగానే ఉంటున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకుని వాటిని వినియోగంలోకి తీసుకువస్తే అటు వ్యాపారులతో పాటు వినియోగదారులకు సైతం ఎంతో మేలు జరగనున్నది.

దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో రామంతాపూర్ వెంకటరెడ్డినగర్, ఉప్పల్ బీరప్పగడ్డ, ఉప్పల్ గాంధీనగర్‌లో 3 మోడల్ మార్కెట్లను నిర్మించారు. రిజర్వేషన్ల వారీగా వేలం వేసి లబ్ధిదారులకు కేటాయించారు. తీరా అందులోకి వెళ్లి చూస్తే కనీస సౌకర్యాలు కరువయ్యాయి. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల లాంటి కనీస వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా మీరే సమకూర్చుకోవాలంటూ చెప్పడంతో ఎవరూ కూడా అక్యూపై చేసుకునేందుకు ముందుకు రాలేదు. దీంతో రెండేళ్ల తర్వాత మరోసారి వేలం వేసినా అదే పరిస్థితి. దీంతో అధికారులు ఏమీ చేయాలో తోచక అలానే వదిలేశారు. అప్పటి నుంచి దాదాపుగా తొమ్మిదేళ్లుగా మోడ్రన్ మార్కెట్లు నిరూపయోగంగానే ఉంటున్నాయి. ఇదే అదునుగా భావించిన కొందరు ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నారు. మద్యం తాగడం, గంజాయి సేవిస్తున్నారు. దీంతో అవి ఉపయోగపడక పోగా కొత్త సమస్యను తెచ్చిపెట్టాయి.

2016 లో ప్రారంభం..

2016 డిసెంబర్‌లో అప్పటి మేయర్ బొంతు రామ్మోహన్ ఈ మార్కెట్లను ప్రారంభించారు. 3 మార్కెట్లలో కలిపి 49 షాపులు ఉండగా అందులో కేవలం 2 మాత్రమే అక్యూపై అయ్యాయి. అయితే వారు కూడా అద్దె చెల్లించడం లేదు.

- వెంకటరెడ్డినగర్ నిర్మించిన 15 షాపులకు గాను అన్ని అలాగే ఉన్నాయి. వేలంలో దక్కించుకున్నా వారు వసతులు లేక అలానే వదిలేశారు.
- ఉప్పల్ గాంధీనగర్ కూరగాయల మార్కెట్‌లో రూ. 70 లక్షలు వెచ్చించి నిర్మించిన మోడల్ మార్కెట్లలో గ్రౌండ్, మొదటి అంతస్తుల్లో కలిపి 15 షాపులు నిర్మించారు. వాటిల్లోనూ వసతుల్లేక ఎవరూ ముందుకు రావడం లేదు.
- ఉప్పల్ మండే మార్కెట్ బీరప్పగడ్డలో రూ. 50 లక్షల వ్యయంతో మోడల్ మార్కెట్ నిర్మించారు. అందులో 19 షాపులు ఉన్నాయి. వేలంలో దాదాపు షాపులను దక్కించుకున్నా ఇప్పటికీ రెండు మాత్రమే అక్యూపై అయ్యాయి.

తైక్వాండోలో ప్రతిభ చాటిన చిన్నారులు



చిన్నారులకు బెల్టులు, పతకాలను అందజేస్తున్న సుబ్బరాజు తదితరులు

సనత్‌నగర్: జెక్‌కాలనీలోని మహాత్మాగాంధీ పార్కులో ఈగల్ తైక్వాండో అకాడమీలో శిక్షణ పొందుతున్న బాలబాలికలకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బెల్టులు, పతకాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ సలహాదారు, గ్రీన్‌సిటీ అధినేత కొండ్రాజు సుబ్బరాజు తైక్వాండో శిక్షణలో క్రీడాకారులకు అవసరమైన క్రీడా పరికరాలను అందజేశారు. అనంతరం వివిధ స్థాయిల్లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన 40 మంది క్రీడాకారులకు పసుపు, ఆకుపచ్చ, నీలి రంగు బెల్టులను ప్రదానం చేశారు. కాలనీ ప్రతినిధులు చింతిరెడ్డి అనంతరెడ్డి, వెల్లంకి శారద, శివారెడ్డి, ఆర్.బాషా, తైక్వాండో కోచ్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

సనత్‌నగర్: హెచ్ఆర్‌సీ ఆస్పత్రి ఆధ్వర్యంలో సనత్‌నగర్ జెక్‌కాలనీలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. శిబిరం ద్వారా రుమటాలజీ, డెర్మటాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, ఫిజియోథెరపీ విభాగాల్లో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.అలాగే రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, బీఎండీ పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహించారు. ఆస్పత్రి ఎండీ రాజ్‌కిరణ్ పర్యవేక్షణలో వైద్య నిపుణులు, సిబ్బంది శిబిరాన్ని నిర్వహించారు. జెక్‌కాలనీ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లు ప్రసాద్, రాజశేఖర చందు, శివారెడ్డి, వెంకట్ సోమ, తదితరులు ఈ వైద్య శిబిరానికి సహకారం అందించారు.



ఉచిత వైద్య శిబిరం

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

బన్సీలాల్‌పేట్: ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైయిందని కార్పొరేటర్ కె. హేమలత అన్నారు. ఆదివారం డివిజన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బన్సీలాల్‌పేట్‌లో అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డివిజన్‌లో కోట్లాది రూపాయల వ్యయంతో అనేక ప్రజాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. బీఆర్ఎస్ నాయకులు కె. లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, అరుణ్‌గౌడ్, కుమార్ యాదవ్, దేశపాక శ్రీనివాస్, వినయ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి

బ్లాక్ ఫిల్మ్‌ల తొలగింపు



బ్లాక్‌ఫిల్మ్ తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: నిబంధనలకు విరుద్ధంగా కారు అద్దాలకు ఏర్పాటు చేసిన బ్లాక్ ఫిల్మ్‌లను బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బంజారాహిల్స్‌లో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ హరిప్రసాద్ కట్టా పర్యవేక్షణలో పోలీసులు కారు అద్దాలకు ఏర్పాటుచేసిన బ్లాక్ ఫిల్మ్‌లను తొలగించి జరిమానా విధించారు. కార్ల యజమానులు బ్లాక్ ఫిల్మ్‌లు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని తనిఖీల్లో పట్టుబడితే జరిమానాలు విధిస్తామన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం

కాచిగూడ: హిమాయత్‌నగర్‌లోని మెల్కోటే పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆదివారం స్థానిక కార్పొరేటర్ మహాలక్ష్మీ రామన్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యాయామం చేసి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామన్‌గౌడ్, భూషణ్ రావు, తదితరులు పాల్గొన్నారు.



ఓపెన్ జిమ్ ప్రారంభిస్తున్న కార్పొరేటర్

వ్యక్తి ఆత్మహత్య

వెంగళరావునగర్: అప్పుల బాధ తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన కె. సూర్యనారాయణ (45) నానక్‌రామ్‌గూడలో ఉంటూ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 16న ఆదివారం ఉదయం కొడుకు వరసైన భరత్‌కుమార్‌కు ఫోన్ చేసి యాదగిరినగర్‌లో దుర్గాప్రసాద్ అనే వ్యక్తి ఇంట్లో ఉన్నానని చెప్పాడు. తాను తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని దుర్గాప్రసాద్ వేధిస్తూ కడుపులో కొట్టాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆందోళన చెందిన భరత్‌కుమార్ హుటాహుటిన యాదగిరినగర్‌కు వచ్చాడు. అప్పటికే సూర్యనారాయణ కాలిన గాయాలతో దుర్గాప్రసాద్ ఇంటి ముందు పడి ఉన్నాడు.108కు ఫోన్‌చేసి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సూర్యనారాయణ మృతిచెందాడు. భరత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థి అదృశ్యం

బంజారాహిల్స్: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్పోర్ట్స్ అకాడమీలో జూడోగేమ్‌లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థి అదృశ్యమైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..షేక్‌పేటలోని స్పోర్ట్స్ అకాడమీలో తొమ్మిదో తరగతి చదువుతున్న గణేష్ ఈ నెల 14న కనిపించకపోవడంతో అక్కడున్న సీసీ కెమెరాలను పరిశీలించగా 13న రాత్రి స్టేడియం వెనుక వైపు నుంచి గోడ దూకి వెళ్లిపోయిన దృశ్యాలు కనిపించాయి. ఈ విషయాన్ని గణేష్ తండ్రికి తెలుపగా 13న రాత్రి 9.30 గంటలకు తనకు వేరే ఫోన్ నుంచి మాట్లాడి రూ.200 ఫోన్ పే చేయాలనడంతో పంపించానని చెప్పారు. అకాడమీ ప్రిన్సిపాల్ బాలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



గణేష్

భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణోత్సవం



అడ్డగుట్ట: సీ సెక్షన్‌లోని మార్కండేయ దేవాలయంలో ఆదివారం శివ పార్వతుల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. మార్కండేయ సహిత శివపంచాయతన ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పద్మశాలి, ఆలయ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం గుంటూరుకు చెందిన మార్కండేయ పీఠాధిపతి ప్రభాకరం స్వామీజి పర్యవేక్షణలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు కత్తుల సుదర్శన్, సుదేశ్, కల్లెపల్లి రాజు, బొమ్మ నరేందర్ పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యాశాఖమంత్రిని నియమించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్తు (టీజీవీపీ) రాష్ట్ర అధ్యక్షులు నక్క శ్రీశైలంయాదవ్ ఆదివారం డిమాండ్ చేశారు. ఏడాది పాలనను పూర్తి చేసుకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటు అన్నారు. వర్సిటీల సమస్యలను పరిష్కరించాలని, వర్సిటీల అభివృద్ధికి నిధులను పెంచాలని, అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

స్కిల్ సెంటర్స్ ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

కాచిగూడ: నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో స్కిల్ సెంటర్స్ ఏర్పాటు కోసం నిరుద్యోగ యువత నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ అడపా వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ, జిల్లా, మండ స్థాయిలో సెంటర్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్కిల్ సెంటర్స్ ద్వారా వెబ్ డిజైనింగ్, సాఫ్ట్‌వేర్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ, డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, ఎథికల్ హ్యాకింగ్, పైథాన్, బ్లాక్ చెయిన్, తదితర 100కు పైగా కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అగ్ని ప్రమాదంలో ఆటోలు దగ్ధం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం–11లోని షా బిల్డింగ్ వెనుకాల ఉన్న వీధిలో బంజారా లేక్‌ను ఆనుకొని ఉన్న స్థలంలో మంటలు చెలరేగి పార్కింగ్ చేసి ఉన్న రెండు ఆటోలు కాలిపోయాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. మంటలు చెలరేగడానికి కారణాలపై ఆరా తీస్తున్నారు.

స్విమ్మింగ్ పూల్ ప్రారంభానికి సిద్ధం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ లేడీస్ హాస్టల్‌లో నిర్మించిన స్విమ్మింగ్ పూల్ ప్రారంభానికి సిద్ధమైంది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహకారంతో ఖేలో ఇండియా నిధులలో రూ.5 కోట్లతో నూతన స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించారు. నిర్మాణం పూర్తి చేసుకున్న కొత్త స్విమ్మింగ్ పూల్‌ను వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు సమాచారం.

మత సామరస్యానికి ప్రతీక గ్యార్వీ ఉత్సవాలు

సనత్‌నగర్: గ్యార్వీ ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీలో ఆరిఫ్, ఆధ్వర్యంలో జరిగిన గ్యార్వీ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఐక్యతను పెంపొందించడంలో గ్యార్వీ ఉత్సవాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో సయిద్ అలీ ముస్తఫా జిలానీ, బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, నరేందర్‌రావు, షేక్ అబ్బాస్, సాబెర్ అలీ, వాహిద్ తదితరులు పాల్గొన్నారు.



గ్యార్వీ ఉత్సవాల్లో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



ఉమేష్‌కుమార్

సికింద్రాబాద్: రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన మేరకు.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫాం నెం. 2లో శనివారం అర్ధరాత్రి మధ్యప్రదేశ్‌లోని అనుపూర్‌కు చెందిన ఉమేష్ కుమార్(22) ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి..



శ్రీధర్

సికింద్రాబాద్: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతి చెందాడు. ఈ ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. తార్నాకకు చెందిన గాజుల శ్రీధర్(51) లాలాగూడ రైల్వే వర్క్‌షాప్‌లో సీనియర్ సెక్షన్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం మౌలాలి – చర్లపల్లి రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

అమీర్‌పేట: పేద, మధ్యతరగతి వర్గాలకు దళిత చైతన్య సంఘం అండగా ఉంటుందని సంఘం వ్యవస్థాపకుడు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ అన్నారు. దళిత సంఘం ఏర్పాటై 8 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ఆదివారం బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం వద్ద నిరుపేద మహిళలకు చీరలు పంచి పెట్టారు. ఎప్పటికప్పుడు పేద ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పాలకవర్గం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు.



చీరలు పంపిణీ చేస్తున్న దళిత చైతన్య సంఘం వ్యవస్థాపకులు

తాగునీటి పైపులైన్ పనులు త్వరగా చేపట్టాలి



పైపులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్

వెంగళరావునగర్: వేసవి దృష్ట్యా తాగునీటి పైపులైన్ల పనులను త్వరగా చేపట్టాలని కార్పొరేటర్ దేదీప్య విజయ్ జలమండలి అధికారులకు సూచించారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్, మసీదుగడ్డ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఆమె పర్యటిస్తూ స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో జవహర్‌నగర్, మసీదుగడ్డ ప్రాంతాల్లో నీటి ఎద్దడిని నివారించేందుకు రూ.50 లక్షల నిధులను మంజూరు చేయించినట్టు పేర్కొన్నారు. పనులు ప్రారంభించేలోపుగా ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయాయని, అనంతరం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా కూడా పనులు చేపట్టడం లేదన్నారు. అధికారులను ఇదే విషయంపై ప్రశ్నిస్తే మంత్రి రావాలని, వాటర్‌వర్క్స్ ఎండీ డేట్‌ఫిక్స్ చేయాలని చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. వెంటనే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, శ్యాంరావు, బాలకృష్ణ, పవన్ ముదిరాజ్, ఆంజనేయులు యాదవ్, బాలు, యాదగిరి పాల్గొన్నారు.

నకిలీ సిమ్‌కార్డులతో మోసం కేసులో పలువురి రిమాండ్

పంజగుట్ట: అమాయకుల వ్యక్తిగత గుర్తింపు పత్రాలను సేకరించి వాటి ఆధారంగా సిమ్‌కార్డులను జారీ చేసిన వ్యక్తితో పాటు వాటిని కొనుగోలు చేసి పలువురిని బెదిరించడమే కాకుండా బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్న మరో ఇద్దరిని పంజగుట్ట పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేటలో భవానీ కమ్యూనికేషన్ పేరిట దుకాణం నిర్వహిస్తున్న సంతోష్‌కుమార్ గ్రామస్తుల గుర్తింపు పత్రాలను ఉపయోగించి ఆరోగ్యశ్రీ నల్లగొండ జిల్లా మేనేజర్ వంశీకృష్ణ, పర్శరాములుకు సిమ్‌కార్డులు జారీ చేశాడు. వారు సదరు సిమ్‌కార్డులను ఉపయోగించి సిద్దిపేటకు చెందిన చక్రధర్‌గౌడ్ అనే వ్యక్తికి బెదిరింపు సందేశాలను పంపించారు. సిద్దిపేట నియోజకవర్గంలో సామాజిక కార్యకలాపాల్లో పాల్గొనరాదంటూ హెచ్చరించారు. ఈ క్రమంలోనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వంశీకృష్ణను అవినీతి ఆరోపణలపై ఆరోగ్యశ్రీ శాఖ నుంచి తొలగించారు. అయినప్పటికీ 2023 జూన్‌లో మళ్లీ విధుల్లోకి చేరాడు. డిసెంబర్ 2023 వరకు అప్పటి ఆరోగ్య మంత్రి హరీష్ రావు క్యాంప్ కార్యాలయంలో పనిచేశాడు. నకిలీ సిమ్‌కార్డులతో మోసాలకు పాల్పడుతున్న సంతోష్‌కుమార్, పర్శరాములు, వంశీకృష్ణను ఆదివారం రిమాండ్‌కు తరలించారు.

ఈ మార్గంలో వెళితే ప్రమాదం..

బౌద్ధనగర్: డివిజన్‌లోని నాలాపై ఉన్నటువంటి సిమెంట్ స్లాబ్‌లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం వేసి స్లాబ్‌ల కారణంగా అవి పూర్తిగా శిథిలావస్థలకు చేరడంతో పాటు అస్తవ్యస్తంగా ఉన్నాయని చెబుతున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదచారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని వాపోతున్నారు. అందువల్ల సంబంధిత అధికారులు వెంటనే పాడైపోయిన స్లాబ్‌లను తొలగించి నూతన వాటిని సక్రమంగా అమర్చాలని కోరుతున్నారు.



నాలాపై అస్తవ్యస్తంగా ఉన్న సిమెంట్ స్లాబ్‌లు

ఇంకో చాన్స్..

- కుటుంబ సర్వేకు మళ్లీ అవకాశం
- 28 వరకు వార్డు కార్యాలయాల్లో వివరాలు ఇవ్వొచ్చు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

బంజారాహిల్స్: గతేడాది నెలన్నర ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు. సమగ్ర కుటుంబ సర్వేలో దరఖాస్తు చేసుకోని వారు ఈ నెల 16 నుంచి 28వ తేదీ వరకు తమ వివరాలు ఇచ్చేందుకు అవకాశం కల్పించిన ప్రభుత్వం ఇందు కోసం జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయాల్లో ఏర్పాట్లు కూడా చేసింది. అయితే ఈ సారి ఎన్యుమరేటర్లు ఇంటింటా తిరిగి వివరాలు సేకరించడం లేదు. గతంలో ఇంటింటికి వెళ్లినప్పుడు తాళాలు వేసి ఉన్న, సొంతూళ్లు, విధులకు వెళ్లిన వారు ఈ సారి ప్రజాపాలన కేంద్రాలకు వెళ్లి తమ వివరాలు అందించాల్సి ఉంటుంది.

అందుబాటులో అధికారులు

కుటుంబ సర్వే కోసం కార్యాలయాలకు వెళ్లకుండా టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా సమాచారం ఇవ్వడానికి కూడా అవకాశం కల్పించారు. టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫోన్ చేసేలా అవకాశం కల్పించారు. వార్డు కార్యాలయాలు, సర్కిల్ కార్యాలయాల్లోనూ ప్రజాపాలన కేంద్రాలను ఏర్పాటు చేశామని ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని సర్కిల్ అధికారులు తెలిపారు.

- ఇదిలా ఉండగా టోల్‌ఫ్రీ నెంబర్ (040–21111111) ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను ఏ రోజుకారోజు సంబంధిత అధికారులు ఆయా సర్కిల్ కార్యాలయాలకు పంపించనున్నారు. ఒకేసారి ఈ ఫారాలను ఇంటింటికి వెళ్లి సర్వే చేయనున్నారు. ఈ టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి పేరు, అడ్రస్, పిన్‌కోడ్, వార్డు పేరు, వ్యక్తిగత ఫోన్ నెంబర్ వివరాలను తెలియజేయాల్సి ఉంటుంది. వీటి ఆధారంగా ఆయా ఎన్యుమరేటర్లు ఆ ఇళ్లకు వెళ్లి సర్వే చేసేందుకు అవకాశం కల్పించారు.